ఓంశ్రీసాయిరాం

## భీష్ముడు

ఆచార్యులలో యిద్దరుంటున్నారు లోకములో. భీష్మాచారి, ద్రోణాచారి. భీష్మాచారి ప్రారంభమునందే పవిత్రుడై చరిత్రను గుర్తించి, దివ్యత్వాన్ని భజించి, అనుభవించి, ఆనందాన్ని గ్రోలినవాడు. ఎట్లనగా పాలను మధించి వెన్నగా తీసుకొని వేరుగా పెట్టుకొన్నవాడు. ఇతను ఈ వెన్నను తరువాత నీటిలో కలిపాడు. కాని, ఆ నీటిలో ఈ వెన్న కలువలేదు. ద్రోణాచార్యుడు ముందుగానే పాలను తీసుకుపోయి నీటిలో కలిపాడు. నీటిలో పాలు కలిపితే పాలు ప్రత్యేకముగా రావు. అదేవిధముగా ఈ సంసారమనే సాగరములో చేరిపోయాడు ద్రోణాచార్యుడు. ఈ సంసారమనే సాగరములో పడకమునుపే తాను ప్రత్యేకమైన పరమహంసగా తయారైనాడు భీష్మాచార్యుడు. ఒకరు సంసారములో ప్రవేశించి తరువాత వారికి బోధించటానికి పోవటము. అందువలననే ఎంత గుణవంతుడు, ఎంత విద్యావంతుడు, ఎంత శౌర్యవంతుడు అయినప్పటికిని, 'అశ్వద్ధామా హతఃకుంజరః' అనగానే కూలిపోయాడు ద్రోణాచార్యుడు. ఈ మమకారముతో కూడిన హృదయము ద్రోణాచార్యునిది. తాను శరతల్పముపై పరుండినప్పటికీ, తన దేహమందలి రక్తమంతా ప్రవహించినప్పటికీ ఏబది ఆరు దినములు కేవలము శాంతిపర్వము బోధించుకుంటూ శాంతజీవుడై జీవించుకుంటూ వచ్చాడు. కష్టములందు, దుఃఖములందు, విచారములందు, బాధలయందు ప్రశాంత చిత్తముననుభవించినవాడు భీష్మాచార్యుడు.

అతను గాంగేయుడు. గంగాపుత్రుడు. తండ్రి నిమిత్తమై సర్వమూ త్యాగము చేసాడు. శంతనుడు సత్యను పెండ్లిచేసుకోవాలను కున్నాడు. అప్పుడు సత్య తండ్రి కొన్ని నిబంధనలు పెట్టాడు. 'అయ్యా! నీకు ముందుగానే ఒక కుమారుడు వున్నాడు. కుమారుని వదలి నా బిడ్డకు పుట్టే కుమారునకు రాజ్యము యివ్వాలని కోరుతున్నాను. అది యివ్వగలవా నీవు?' శంతనునికి చాలా విచారము వేసింది. గొప్ప భక్తిప్రపత్తులు గలవాడు గాంగేయుడు. మహాజ్ఞాని, సర్వసంగపరిత్యాగి, పరిపూర్ణహృదయుడు, పవిత్రభావములు కలిగినవాడు. అట్టి గాంగేయుని మనస్సు కష్టపెట్టటం ఎట్లా? నాకు అక్కరలేదనుకున్నాడు. కానీ, లోపల విచారముగా వున్నాడు. ఇదే మనస్సుయొక్క సంకల్పము. సత్యను పెండ్లిచేసుకోవాలనుకున్నాడు, పైకిమాత్రం కనిపించనప్పటికిని లోపల విచారముచెందుతున్నాడు. ఒకనాడు గాంగేయుడు తండ్రిని చూచాడు. 'తండ్రీ! ఎందుకు మీరు విచారిస్తున్నారు? మీకు ఏదైనా కోరిక వుంటే చెప్పండి. నాకు చేతనైనంత వరకు సహాయము చేస్తాను' అన్నాడు. తండ్రి కుమారుని దగ్గరగాని, కుమారుడు తండ్రి దగ్గరగాని రహస్యము వుంచుకొనేవారు కాదు. అప్పుడు తండ్రి చెప్పాడు, 'నేను సత్యవతిని పెండ్లి చేసుకోవాలని అనుకొన్నాను. కాని, వారి కోరిక ధర్మవిరుద్ధముగా వుంటున్నది. కనుక, నేను వద్దని చెప్పాను' అని అన్నాడు. 'నాన్నా! నీ అభీష్టము నెరవేరాలంటే నేను వివాహమాడను' అన్నాడు. అప్పుడుకూడా సత్యవతి తండ్రి, 'అయ్యా! నీవు ఈనాడు వివాహము చేసుకోకుండా వుండవచ్చుగాని, రేపు చేసుకోవచ్చు. ఆ తరువాత పుట్టిన పిల్లలు నాకూ రాజ్యము కావాలని ఆశించవచ్చు' అన్నాడు. ఛీ! నా తండ్రిని కష్టపెట్టే భావము నాకు వద్దు అని, 'నా జీవితమంతా బ్రహ్మచారిగానే వుంటానని' ప్రతిజ్ఞ చేశాడు. ఇది కఠినమైన ప్రతిజ్ఞ కనుక భీష్ముడని పేరుపెట్టారు. శ్రీరామచంద్రుడు తండ్రి నిమిత్తమై పదునాలుగు సంవత్సరములు అరణ్యవాసము చేశాడు. కానీ, భీష్ముడు యావజ్జీవితమే తండ్రికోసము త్యాగము చేశాడు. కనుక, అతని జీవితము అంత పవిత్రముగా వుంటున్నది.

కురువంశ చక్రవర్తి అయిన శంతను మహారాజు మరణించగా అతని కుమారుడు భీష్ముడు దశాబ్దికర్మ దీక్షలో నిమగ్నుడై వున్నాడు. అటువంటి దుఃఖసమయంలో గదాధరుడనే రాజు తన వద్ద తపస్సుచేసి సంపాదించిన చక్రాయుధం వుందనే దురహంకారముతో, 'యువరాజా! శంతనుని పట్టపురాణి అయిన సత్యవతిని నాకు వెంటనే అప్పజెప్పు లేదా యుద్ధానికి సిద్ధంగా వుండు' అని బెదరిస్తూ వర్తమానం పంపాడు. మహాపరాక్రమశాలియైన భీష్ముడిది

విని సహించగలడా! అట్టి దీక్షాసమయంలో దివ్యాస్త్రములను తాకుట నిషిద్ధమని రాజపురోహితుని వలన తెలుసుకొని, 'ఈ పదిరోజుల శ్రాద్ధకర్మలు ముగిసిన తరువాత యుద్ధం చేస్తానని' భీష్ముడు సమాధానం పంపేడు. సరేనన్నాడు గదాధరుడు. మోహావేశంలో వున్న ఆ దుష్టుడు వంచనతో భీష్ముని జయించాలన్న దురాలోచనతో మాట తప్పి వెంటనే తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ చక్రాయుధం భీష్ముని రాజభవనం చుట్టూ తిరుగుతూ నిలచిపోయిందేగాని లోనికి ప్రవేశించలేకపోయింది. ఈ అద్భుత దృశ్యం అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచింది. పాపాత్ముడైన గదాధరుడు పరాభవం పొందాడు.

ఒకనాడు ఉదయమే ధర్మరాజు కృష్ణుని దర్శనానికి వెళ్ళాడు. అప్పుడు కృష్ణుడు పద్మాసనం వేసుకొని ధ్యానంలో నిమగ్నుడై వున్నాడు. చెక్కిళ్లమీద బాష్పబిందువులు రాలుతున్నాయి. కృష్ణుడు దేనిని గురించి ధ్యానము చేస్తున్నాడా అని ధర్మరాజు ఆశ్చర్యపడ్డాడు. కృష్ణుడు కళ్లు తెరిచాక ధర్మరాజు సాహసించి అదే ప్రశ్న వేశాడు. తనపట్ల భక్తి కలిగిన ఒక మహనీయుని గురించి ఆలోచిస్తూ, ఆనందిస్తున్నాని కృష్ణుడు చెప్పాడు. ఆయన ఎవరో కాదు భీష్ముడే. భీష్ముని చిత్తం నిరంతరమూ కృష్ణుని ధ్యానిస్తూ వుంటుంది. అంపశయ్యమీద వేదనపడుతున్నప్పుడు కూడా కృష్ణచింతనే. భీష్ముని, భక్తిని గురించి కృష్ణుడే అభిమానించి ఆనందపరవశుడైనాడు.

భీష్ముడు మహాసత్యవ్రతుడు. తన శక్తియుక్తులను సర్వవిధాలా ధారపోసి, యుద్ధము చేయటానికి పూనుకొన్నాడు. పాండవుల సైన్యాన్ని చెల్లాచెదరు చేశాడు. చాలా భయంకరమైన యుద్ధము జరిగింది. కృష్ణుని రక్షణ, అనుగ్రహము పాండవ పక్షమున వుండుటచేత వారు రక్షింపబడ్డారు. భీష్ముడు క్రింద పడిపోయాడు. భీష్ముడు యుద్ధభూమిలో క్రిందపడిన దినము పదవదినము. అప్పటినుండి మిగిలిన ఎనిమిది దినములు కృష్ణుడు జరుపవలసిన యుద్ధమును జరిపించినాడు. భీష్ముడు అన్ని దినములు అంపశయ్యపైనే ఉన్నాడు. విజయధ్వజాన్ని అందుకొని పాండవులందరు ద్రౌపదితో అంపశయ్యపైనున్న భీష్ముని దగ్గరికి వచ్చారు. ఈ యుద్ధము క్రీస్తుపూర్వము 3138 సంవత్సరములనాడు జరిగినది. భీష్ముడు యుద్ధము చేసినది తొమ్మిది దినములు. అంపశయ్యపై పరుండినది 58 దినములు. ఈ రెండూ చేరితే 67 దినములైనది. భీష్ముడు పాండవులను దగ్గరకు తీసుకొని శిరస్సులను ముద్దాడి, అనేకరకములైన ఆదర్శములనందించి ధర్మజునికి శాంతి పర్వము బోధించాడు. పాండవులకు నీతులను బోధిస్తుండగా, ఏదో ఉద్దేశముతో ద్రౌపది నవ్వింది. పవిత్రశాంతమూర్తీ, మహాజ్ఞానీ, మహావిజ్ఞుడు, పితామహుడూ అయిన భీష్మునివంటి పెద్దలు సంభాషణ జరుపుచుండగా అసభ్యముగా ద్రౌపది నవ్వటము పాండవులకు అసంతృప్తి కలిగించింది.

సర్వజ్ఞుడైన భీష్ముడు పాండవుల హృదయాలు గమనించి తగిన సమాధానమందించుటకై ద్రౌపదిని దగ్గరకు పిలిచినాడు. ద్రౌపది శిరస్సుపైన హస్తముంచి, 'దీర్ఘసుమంగళీభవ' అని ఆశీర్వదించి, 'అమ్మా! నీవు కారణములేని కార్యము చేయవుకదా! అకారణముగా నీవు నవ్వవు కదా! నీ నవ్వుకు కారణము చెప్పి, నీ పతుల సందేహాన్ని తీర్చు' అన్నాడు. ద్రౌపది చేతులు కట్టుకొని, 'పూజనీయా! ఆనాడు మహాసభయందు నాకు పరాభవము జరిగినపుడుగాని, లేక నా పతులు పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసము, పదమూడవ సంవత్సరము అజ్ఞాతవాసము చేసిన కష్టసమయమునందుగాని నీవు యెలాంటి సందేశాన్ని అందించలేదు. దుర్గుణులు, దుర్మార్గులు, దురహంకారులు అయిన కౌరవులకు చెప్పవలసిన ధర్మములు పాండవులకు చెబుతున్నారు. పాండవులు మహాధర్మస్వరూపులు. ఏనాడూ ధర్మము తప్పనివారు. అటువంటివారికి నీవు ధర్మము చెప్పనవసరము లేదుకదా. ఎవరికి ధర్మము అవసరమో వారికి చెప్పక, ధర్మము అవసరములేని ధర్మస్వరూపులకు బోధలు చేయటములో అంతరార్థము యేమిటో గుర్తించలేక నవ్వినాను' అన్నది. 'ఇంతేకాదు, ఆనాడు మహాసభలో ధర్మజుడు జూదమాడి, నన్ను ఒడ్డి ఓడిపోవటముచేత అరణ్యమునకు పంపటము, నన్ను పరాభవించటము జరిగింది. ఇది న్యాయమేనా? ధర్మరాజునకు నన్ను ఒడ్డే అధికారము వున్నదా? నేను పాంచాలిని. ఐదుగురికి భార్యను. ఒక్క భర్త నన్ను ఒడ్డినప్పుడు నన్ను పరాభవించుటలో

ఏమైనా ధర్మము వున్నదా? నీవు ధర్మస్వరూపుడవు. ధర్మజ్ఞుడవు. ధర్మప్రబోధకుడవు. ఆనాడు నీవు కౌరవులకు ఈ ధర్మాన్ని ఎందుకు ప్రబోధించలేదు? తానోడిన తరువాత నన్నొడ్డినాడు. తానోడిన తరువాత తనకు నన్ను ఒడ్డే అధికారము లేదు. నేను ఆనాడే మిమ్ములను ప్రశ్నించాను. 'నన్నొడ్డి తానోడెనా? తానోడి నన్నొడ్డెనా?' అని ప్రశ్నించినపుడు మీరు యేమాత్రము సమాధానము చెప్పలేని పరిస్థితిలో కూర్చున్నారు. కాని, ఈనాడు అవసరములేని ధర్మాన్ని ప్రబోధిస్తున్నారు. ఇది నవ్వుకు కారణము కాక మరేమవుతుంది?' అని ఒకవిధమైన తీవ్రమైన ఉద్రేకముతో భీష్ముని ప్రార్థించింది.

భీష్ముడు భయంకరమైన జీవన్మరణముల మధ్యలో ఉన్నప్పుడు ద్రౌపది ఆరీతిగా భీష్మునితో వాదించుటవలన ధర్మజునకు కష్టము వేసింది. భీష్ముడు ఫక్కున నవ్వి, 'ద్రౌపదీ! నీవు అడుగవలసిన ప్రశ్నే అడిగినావు. చాలా సంతోషకరమైన విషయము. దానికి సరియైన జవాబు యివ్వాలి. కనుక, ఈ జవాబును నేను చెప్పుచున్నానువిను'మని పాండవులనంతా శాంతపరచి జవాబు చెప్పటానికి పూనుకున్నాడు. ద్రౌపదిని చెంతచేర్చుకొని తల నిమురుతూ, 'అమ్మా! బిడ్డా! ఇంత కాలము ధర్మములు నాలో లేకపోలేదు. దుష్టులు, దురహంకారులు, దుర్మార్గులు అయినవారి ఆహారము నేను భుజింటముచేత నా ధర్మములన్నియూ అట్టడుగున పడిపోయినవి. దుర్మార్గుల ఆహారమే నా దేహాన్ని పెంచి పెద్దచేసింది. దానితో ధర్మభావములు అడుగు భాగమున చేరిపోయినవి. నీ భర్త వేసిన బాణముచేత, ఆ దుర్మార్గపు ఆహారముచేత ఏర్పడిన రక్తమంతా ఈనాడు భూమిపాలైంది. అట్టడుగుననున్న ధర్మములు ఈనాడు బయటపడినవి. ఇదియే ఈనాడు ధర్మము చెప్పటములో కారణము' అని వున్న సంగతి వెల్లడించాడు.

దీనినిబట్టి అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములచేత ప్రోగుచేసిన ధనము ధర్మ, శాంతి సద్గుణములను అట్టడుగున పడవేస్తుందనే సత్యాన్ని ఈ శాంతిపర్వములో సూక్తిగా బోధించినాడు. దీనిని పురస్కరించుకొని కృష్ణుడు పాత్రదోషము, పదార్థదోషము, పాకదోషము ఈ మూడు దోషములు ఆహారములో వుండకూడదని గీతలో ప్రబోధించాడు. ఆహారము ననుసరించి అక్రమమైన భావములు చెలరేగటానికి ఒక కారణమన్న సత్యము భీష్ముడు లోకానికి చాటినాడు. ఆహారమును బట్టియే సంకల్పములు. సంకల్పములు బట్టియే క్రియలు. క్రియలను బట్టియే మంచిచెడ్డలు బయలుదేరుతుంటాయి. పాండవులకు తగిన ధర్మములు ప్రబోధించి భీష్ముడు శుభకృత్‌నామ సంవత్సరము మాఘశుద్ధ అష్టమి రోజున తన జ్యోతిని పరమాత్మలో లీనముచేసుకొన్నాడు. దానికి ముందు దినము సంక్రమణ పర్వదినము. సూర్యుడు ఉత్తర దిశకు ప్రయాణముచేసే దినము మకరసంక్రాంతి అంటారు. అది రథసప్తమికూడ. ముందు దినము రథసప్తమి కావటముచేత పాండవులనందరను చేర్చుకొని తన పితృదేవతలకు పిండములను అంపశయ్యపై నుండియే వదలి భీష్ముడు అన్నిటికినీ సంసిద్ధుడై వున్నసమయంలో అష్టమి ప్రారంభముకాగానే నిర్యాణమునందినాడు.

ఈనాడు పంచాగమునుబట్టి భీష్ముడు పోయిన దినము ఏకాదశి అని అనుకుంటున్నాము. కాని, ఇది చాలా పొరపాటు. అది అష్టమి, రోహిణీ నక్షత్రము. కృష్ణుడు పుట్టినది అష్టమి, రోహిణీ నక్షత్రమే. కనుక, కృష్ణుడు పుట్టిన రోజునే భీష్ముడు మరణించాడు. అది మాఘమాసముకూడ. ఈ దినము మరణమునకు పవిత్రమైన దినముగ భావించినారు. ఉత్తరాయణకాల నిమిత్తమై పవిత్రమైన కృష్ణచింతనయందే కాలము గడిపినాడు. భీష్ముని దృష్టిలో జననముకంటే మరణము ప్రధానమైనది. మంచి ఘడియలలో పుట్టినాడనేదానికంటే మంచిఘడియలలో మరణించినాడనేది ప్రధానమైనది. పునర్జన్మకు అదే పునాది.

శాంతభక్తితో భగవంతుని పొందినవారు యెవరు ఈ జగత్తులో? మహా కఠినమైన దీక్షను పట్టిన భీష్ముడు. జగత్తు నిమిత్తమై తాను సర్వ సుఖములను త్యాగము చేసినాడు. భీష్మప్రతిజ్ఞ గావించినవాడు. శారీరక, మానసిక జీవితమును త్యాగము గావించి దివ్యత్వమును పొందిన మహాత్యాగి. కట్టకడపటికి దేశోద్ధార నిమిత్తమై తాను నాయకత్వమును వహించి మహాభారత యుద్ధములోపల పాండవులపై యుద్ధము చేసినాడు. తొమ్మిదవ దినము అర్జునుడు వేసిన అంబులచేత తాను కూలిపోయాడు. శరీరమంతా ఈ అంబులు చేరి వుంటున్నాయి. దేహము

భూమిపైన పడలేదు. అంతా అంబులపైనే ఆధారపడి వుంటున్నాది. దానినే శరతల్పము అన్నారు. అనగా శరముల పాన్పుగా తయారైంది. తిరిగి అదే అర్జుననే కోరినాడు. అంత శాంతమూర్తి. ఎవరు తనను నేలకూల్చారో ఆ అర్జుననే కోరినాడు. 'అర్జునా! నాకు బెడ్ మాత్రం తయారు చేశావు. కాని, పిల్లో యివ్వలేదే? తల క్రిందకు పడిపోతున్నాది'. అంబులను వేసి మధ్యభాగములో తల పెట్టినాడు. ఆనాటి మొదలు యాభైఆరు దినములు భగవచ్చింతన చేస్తూ కూర్చున్నాడు. దేహమునకు ఎన్ని బాధలు సంభవించినా, ఎన్ని నొప్పులు తనను బాధించిననూ లెక్కచేయలేదు. ఈ కాలము వృధాచేయకూడదని రాజనీతి, గృహనీతి, శాంతిబోధలు యితరులకు చేస్తూ వచ్చాడు. దీనినే శాంతిపర్వమని మహాభారతమందు ఉచ్చరించారు. పాండవులందరికీ వారియొక్క గుణగణవిశేషములన్నింటినీ చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. ఇలాంటి నిగ్రహశక్తి కలిగిన మహాపురుషుడు భీష్ముడు. దీనికంతకూ అతని శాంతభక్తియే మూలాధారము. ఎన్ని కష్టములైనా, ఎన్ని నష్టములైనా, ఎట్టి నిందలైనా, ఎట్టి నిస్సారములైనా కూడను సహించి, భరించి భగవంతుని స్మరించేవాడు. ఆ యుద్ధ సమయమందు కృష్ణుడే భీష్ముని చంపటానికి వచ్చాడు. నిజముగా భీష్ముని కొట్టటానికి యిష్టము లేదు కృష్ణునికి. అర్జునుడు బలహీనుడైపోవటంచేత, అర్జునునికి కొంత రౌద్రము బలపరచే నిమిత్తమై 'అర్జునా! నీవు పిరికిపందవలె వుంటున్నావు. నేనే యుద్ధము చేస్తాన'ని చక్రాయుధము తీసుకొని భీష్మునిపై వస్తుంటే, భీష్ముడు ఆ సమయమందుకూడను కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చాడు,

కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి
గగనభాగంబెల్ల కప్పికొనగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న
జగముల వ్రేగున జగతి గదల
చక్రంబు చేబట్టి చనుదెంచురయమున
పైనున్న పచ్చని పటముజార
నమ్మితి నా లావు నగుబాటుసేయక
మన్నింపుమని క్రీడి మరల దిగువ
కరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని జంపుదు నిన్నుగాతు
విడువుమర్జున యనుచు మద్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు.

'ఓ అర్జునా! నేనిప్పుడు ఈ భీష్ముని చంపుతాను. నన్ను విడిచిపెట్టు అని నన్ను చంపటానికి ఏ భగవంతుడైన కృష్ణుడు వస్తున్నాడో ఆ కృష్ణుడే నన్ను రక్షించాలి' అన్నాడు. చూచారా! ఎంత భక్తో. ఏ భగవంతుడు నన్ను చంపటానికి వస్తున్నాడో ఆ భగవంతుడే నన్ను రక్షించాలని ప్రార్థిస్తూ వచ్చాడు. అంతటి నిశ్చలభక్తి. నిర్మల భావము. అదే శాంతభక్తి.